
# ఇనుప తెరల వెనుక




గొప్ప థ్రిల్లింగ్ కలిగించే విషయాలు కొన్ని వుంటాయి. వాటిల్లో ఒకటి -

ఎదురింట్లో, అందంగా వుండే ఓ ఆడది ఒంటరిగా వుండడం, ఆ ఆడదాని కోసం అప్పుడప్పుడు ఓ మగాడు వస్తూ వుండడం...

నెల రోజుల క్రితం నేను ఆ గదిలో చేరినపుడు ఎదురింటి తలుపులు మూసి వున్నాయి. ఖాళీగానే వుంది. ఆ తర్వాత నాలుగు రోజులకే ఎవరో వచ్చారు. ఎవరో అంటే ఒకే ఒక్క ఆడది.

అప్పుడే నాలో కుతూహలం కలిగింది. నాకు పెళ్ళి అవకపోవడం వల్ల యాంగ్జయిటీ కూడా ఫీలవక తప్పలేదు. ఒకవేళ పెళ్ళయినా ఇలాంటి విషయాల పట్ల ఉత్సాహం చావదు.

మొదటిసారి నేనామెను చూసినప్పుడు ఆమె కిటికీ దగ్గరగా నిల్చుని బ్రష్‌తో పొడుగాటి తల వెంట్రుకలను దువ్వుకుంటున్నది. ఆమె కళ్ళు విశాలంగా వున్నాయి. ఎర్రటి పెదవులు కవ్విస్తున్నట్లుగా వున్నా ఆమె చూపులు ఎంతో సౌమ్యంగా అగుపించాయి.

నన్ను చూసిన ఆమె చూపులు మరల్చుకోలేదు. అక్కడినుంచి వెళ్ళిపోలేదు. మరో మనిషి కోసం ఆ ఇంట్లో చూసినా, అప్పుడూ అప్పుడూ ఆమే కనబడింది.

అలంకరణ పట్ల నిర్లక్ష్యంగా వుండే నేను ఆరోజు కష్టపడి ట్రిమ్‌గా తయారయ్యాను. ఆమె ఆ సాయంత్రం వేళ నీరెండలో కిటికీ దగ్గర నిల్చున్నప్పుడు నన్ను గమనించేలా నిల్చున్నాను బయట.

చాలా సహజం- కాదు ఓ విధమైన చులకన. ఒంటరిగా ఓ అందమైన ఆడది ఎదురుగా వుందంటే ఆమె గురించి ఆలోచించకుండా వుండటం వీలైతే ఓ ట్రయల్ వెయ్యకుండా వుండటం కష్టం.

ఇంతకీ ఆమె ఎవరు?

ఏం చేస్తుంది? ఆమె కెవరూ లేరా?

ఎవరో ఓ మగాడు ఆమె కోసం వున్నాడని ఆ రాత్రి పది గంటల సమయంలో నాకు తెలిసింది.

నిద్ర పట్టక ఓ ఇంగ్లీషు నవల చదువుతూ కిటికీ ఎదురుగా పేము కుర్చీలో వెనక్కు వాలి కూర్చున్నాను. తలుపు చప్పుడయినప్పుడు చూస్తే అక్కడో మగాడు చేతిలో ఏదో ప్యాకెట్‌తో నిల్చుని వున్నాడు. స్వీట్లు అయివుండొచ్చు.

రెండు నిముషాలకు తలుపు తెరుచుకున్నప్పుడు, ఎదురుగా ఆమె నవ్వుతోంది. పెదవులు సాగినయి. తెల్లని పలువరుస తళుక్కుమన్నది.

ఇద్దరూ లోపలకు వెళ్ళగానే తలుపులు మూసుకున్నాయి. ఆమె భుజం మీదుగా అతడి చెయ్యి కిటికీలోంచి కనబడింది.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఇక అనుమానం అనవసరం. నేనూ ఓ ప్రయత్నం చెయ్యవచ్చు.

తెల్లారిన తర్వాత అతడి కోసం వెదికితే జాడలేలేవు.

విరిసిన గులాబీలా వుంది. ఆమె అందం నన్ను పరవశుడిని చేస్తోంది. గోడనున్న అందమైన కాలెండర్లలో యువతుల్లాగే వుంది ఆమె.

పేరేమిటి?

తెలీదు. తెలుసుకునే అవకాశం వుందా?

లేదు.

పోనీ ఆ అవకాశం వస్తుందా?

ఏమో! ఎలా తెలుస్తుంది?

నా దృష్టిలో ఆమె ఓ పజిల్...

ఆమె ఒంటరి ఆడది!

అందమైనది!

తొట్రు పడకుండా నన్ను చూస్తుంది. ఆమెకోసం ఓ మగాడు వస్తున్నాడు. కాని- ఆమె చూపులు చాలా మామూలుగా వున్నాయి. ఆ చూపుల్లో కొంటెతనం లేదు. కవ్వింపు లేదు. ఆహ్వానం లేదు.

మరేమిటి?

ముందుకు దూసుకెళ్ళడానికి ఎన్నో ఆధారాలు వున్నా, ఆమె చూపులు ముఖ్యంగా ప్రవర్తన నన్ను అడ్డుకుంటున్నాయి.

ఇలా ఎంతకాలం?

ఎంతకాలమా? కాదు- కేవలం పది రోజులే గడిచాయి. ఇన్ని రోజుల్లో అతను- ఆ మగాడు పూర్తిగా రాత్రి వేళనే మరో మూడుసార్లు వచ్చాడు.

అతడిని చూస్తే ఆమె కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తాయి.

అతనెవరు?

ఆమె అందం అతనొక్కడికే అంకితమా?

ఐనా అతనంత అందంగా లేదు. నాతో పోల్చుకున్నప్పుడు... కాని ఆడదానికి మగాడిలో కేవలం అందమే ముఖ్యమా? కాకపోవచ్చు. అంతకంటే ముఖ్యమైనది మరోటి వుంది. అతను కురిపించే ప్రేమ...

తెలీదు. ఏమీ తెలీదు. ఆమెతో మాట్లాడాలి. నా ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవాలి.

ఇది సాధ్యమేనా?

సాధ్యమే...

ఓరోజు ఉదయం ఆఫీసుకు వెళ్ళటానికి కేవలం కొన్ని నిముషాల ముందు ఆమె నా గది దగ్గరకు వచ్చి "ఓసారి పెన్ ఇస్తారా? లెటర్రాసి ఇప్పుడే ఇస్తాను" అన్నది.

ఇచ్చాను.

ఆమె రాకకోసం ఎదురు చూస్తూ అక్కడే నిల్చున్నాను. పెన్‌తో ఓ ఇన్‌లాండ్ కవరు కూడా ఇచ్చి- "ఏమనుకోకండి. ఈ ఉత్తరాన్ని పోస్టు చెయ్యండి" అన్నది.

వెళ్ళిపోయింది.

ఆ కవరుమీది ఎడ్రసులో మగాడి పేరులేదు, ఆడదాని పేరు వుంది.

ఈ సంఘటన కారణంగా మా ఇద్దరి మధ్య వున్న దూరం కొంత తగ్గిపోయినట్టుగా అనిపించింది.

రెండ్రోజుల తర్వాత ఓ సాయంత్రం-

నా గదిలో దీపం ప్రకాశవంతంగా వెలుగుతున్నది. రికార్డర్ ఆన్‌చేసి ఓ హిందీ సినిమా పాట వింటున్నప్పుడు సిగరెట్టు కాలుస్తూ-

"మిమ్మల్నే"

చూస్తే ఆమె తలుపు దగ్గర నిలబడి వుంది.

"రండి"

నవ్వి "లైట్లు వెలగడం లేదు. ఏమయ్యిందో చూస్తారా?" అన్నది.

"తప్పకుండా"

బయటకు వెళ్ళాను.

అదోలా వుంది. ఆమెతో ఆ ఇంట్లోకి నడుస్తున్నప్పుడు- ఆమె కోసం వచ్చే మగాడి స్థానంలో ఇప్పుడు నేను.

తలుపులు అప్పటిలా మూస్తే బావుండు.

గబుక్కున వెనక్కు చూశాను. తెరిచే వున్నాయి.

నాముందు ఆమె.

ఐదు నిముషాలలోనే ఆ ఇంట్లో దీపాలు వెలిగాయి. ఫ్యాను తిరిగింది.

"ఏమీ లేదు. ఫ్యూజు పోయింది అంతే"

బయటకు రాబోతున్నప్పుడు

"కూర్చోండి ఒక్క నిముషం"

గాడ్రెజ్ కుర్చీలో కూర్చున్నాను.

నీట్‌గా వుంది గది... టేబిల్ మీది రేడియో ఎప్పుడూ పాడినట్టు వినలేదు.

గోడలకు ఏవో కంపెనీల ప్రకృతి చిత్రాల కేలెండర్లు-

కొన్ని నిముషాలకు ట్రేలో కప్పుతో వచ్చింది.

హార్లిక్స్. డాక్టర్లు సిఫార్స్ చేసే హార్లిక్స్. ఎక్కువ శక్తి ఎక్కువ ఉత్సాహం.

కప్పు ఖాళీచేసి థాంక్స్ చెప్పి బయట కొచ్చాను. ఇంకొంచెం సేపు ఆమె ఎదురుగా కూర్చోవాలనే వుంది. మాట్లాడాలని వుంది.

కాని ఎలా మాట్లాడటం? ఏమని అడగాలి?

ముందుకు వెళ్ళడం ఎలా?

ఆమె బయట పడటంలేదు. ఆపైన సరిగ్గా పదిరోజులకు ఓ శుభోదయాన తలంటి పోసుకున్న జుట్టును ఆరబెట్టుకుంటూనే వచ్చి–

"ఈపూట మీ హోటల్ భోజనం మానెయ్యండి. మీ భోజనం మా ఇంట్లో మరువకండి" అని వెళ్ళిపోయింది.

రెఫ్యూజ్ చెయ్యలేదు.

ఊహించని ఆహ్వానం! ఇంతకీ ఆ రోజున ఏదో పండుగ. ఆఫీసు లేదు కాబట్టి గుర్తుంది.

టైముకు వెళ్ళాను.

ఆమె వంట ఎంతో రుచిగా వుంది. ఎన్నో రోజులుగా హోటలు తిండి తింటున్న నాకు ఆ భోజనం ఓ గొప్ప రిలీఫ్‌ను ఇచ్చింది. మొహమాట పడుతున్నానని మరీ వడ్డించింది.

భోజనానంతరం–

కుర్చీలో కూలబడి "సిగరెట్టు వెలిగించుకో వచ్చునా" అన్నాను.

"మీ ఇష్టం" అన్నదామె చిరునవ్వుతో.

ఆ నవ్వు నాకెంతో ఉల్లాసాన్ని కలిగించింది.

ఈ అవకాశాన్ని జారవిడుచుకో దల్చుకోలేదు.

ఆమె ఈ ఆహ్వానం వెనుక ఏమిటి దాగివున్నది? ఆడది కాబట్టి బయట పడక పోవచ్చు.

ఆమె నా చొరవ కోసం ఎదురు చూస్తోన్నదా?

ఇలాంటి ఆలోచనలు ఆ క్షణాల్లో ఒక్కసారిగా నా మెదడులో ఒక్కటే పరుగులు.

ఏదో ఆరాటం ఆత్రుత.

నిజమే ఈ అవకాశాన్ని వదులుకోరాదు.

అందుకే వున్నట్టుండి ఆమె కళ్ళలోకి చిలిపిగా చూస్తూ– "రాత్రికి కూడా రమ్మంటారా?" అనడిగేను.

మైగాడ్!

విసురుగా సుడిగాలిలా ఆమె లోనికి దూసుకుపోయింది.

ఏం జరగబోతున్నది?

సస్పెన్స్!

అంత విసురుగానూ తిరిగి వచ్చి దాన్ని నా చేతిలో వుంచుతూ "మీ ప్రశ్నలకు జవాబు" అన్నది అదోలా.

ఫోటో ఆల్బమ్.

ఆశ్చర్యంతో తెరిచినప్పుడు నిజంగా షాక్ షాక్ షాక్.

ఆ ఆల్బం నిండుగా ఆమె పెళ్ళి నాటి ఫోటోలు. ఆమె పక్కనే వున్న ఆ మగాడు ఎవరో కాదు అప్పుడప్పుడూ రాత్రివేళ వస్తున్న మగాడే ఆమె భర్త.

మరైతే ఇదంతా ఏమిటి?

అదే ఈ ఒంటరితనం.

అప్పుడే ఆమె అన్నది- "నాకు తెలియకుండానే ఆయన మరో ఆడదాని ప్రేమకు బందీ ఐనాడు. ఆమెకు నా గురించి తెలీదు. తెలిసిన తర్వాత నాకు విడాకులివ్వక పోతే కత్తితో పొడుచుకుంటానన్నది. ఒక వరలో రెండు కత్తులను ఇమడ్చాలని ఆయన ప్రయత్నం చేశాడుకాని ఆమె సాధ్యపడనివ్వలేదు. చివరకు ఆమె సూచించిన మార్గాన్ని నేనంగీకరించాను. మనసు చంపుకుని, ఎందుకంటే ఆయనంటే నాకు ప్రాణం. చట్టం దృష్టిలో ఆయన నా భర్త కాదు. కాని, నా మనస్సాక్షికి ఆయనే దైవం"

వింటున్నప్పుడు నా మొహం మీద కాల్చుకుతినే యాసిడ్‌ను విసరుగా పోసినట్టని పించింది.

ఆమె ఎదురుగా కూర్చోవటం కష్టమయ్యింది.

మళ్ళీ అన్నది ఆమె-

"ఇలా అడగడంలో మీ తప్పులేదు. నా ఈ ఒంటరి జీవితం ముఖ్యంగా ఈ వయసు అప్పుడప్పుడు రాత్రివేళ నాకోసం ఆయన రావటం, మీలో ఆశల్ని రేపి వుండొచ్చు. నేనర్థం చేసుకోగలను. దయచేసి ఈ సంఘటన మన మధ్య జరగలేదనుకోండి. ఇప్పుడు నాకెంతో తేలిగ్గా వుంది"

చెప్పకుండానే బయట కొచ్చాను.

ఇప్పుడు నాకు తేలిగ్గా లేదు. ఎంతో భారంగా వుంది. పెద్ద కొండను మోస్తున్నంతగా...

గది తాళం తీసి లోపలకు వెళుతూనే అనుకున్నాను. వీలైనంత వేగంగా ఆ గదిని ఖాళీచేసి ఆమె ఎదురునించి దూరంగా వెళ్ళిపోవాలని. విరిసిన గులాబీ వెనుక ఎన్ని ముళ్ళు??

(28 -6-1985 మయూరి వారపత్రికలో ప్రచురితం)